# ఝంప

రైలు పరుగెత్తుతున్నది. చెట్లు, పొలాలు, కాలువలు, మబ్బులు వెనక్కు జారుతున్నాయి. గాలి, చల్లగా, పొలాల నుండి, ఎండ మెరుగులో దొర్లి, అలలుగా తాకుతోంది కిటికీలోంచి. ఎదురుగా కూచున్న పల్లెయువతి బలమైన చేపలు, బిస్కట్లు తింటూన్న పిల్లవాడికళ్ల అమాయకపు కాంతి, భర్తతో నవ్వే నవనాగరిక బక్కభార్య సౌందర్య ధ్వంస అలంకరణ, పత్రికమీది సినిమాతార మూడురంగుల నవ్వుముఖం— అతన్ని కదిలించలేకపోతున్నాయి. అతని మనస్సు—ఎండనుండి, లాలనగా జోకొట్టే గాలినుండి, ఊగే తెల్లపెదిమల నల్లమబ్బులనుండి దూసుకొని ఆ ఊరును చేరుతున్నది. ఇప్పటికి—దాదాపు—రెండు—బహుశా: అవును రెండేళ్ళు కాదా ఆవిషయం జరిగి? అంటే—అప్పటికీ—ఇప్పటికీ మళ్ళీ అటువంటి అనుభవం యింతవరకూ చిక్కనే లేదు. భార్యతో "కాపురం" చేస్తున్నాడు. ఫీజులేక బాధ పడుతున్న కాలేజీ అమ్మాయికి ఆ యిబ్బంది తుంపి, ప్రతిఫలం—ఒకరాత్రి ఆమెకు తన మంచంమీద భాగమిచ్చాడు. రోజూ అరేబియా గుర్రంలాగ తనముందుగా వెళ్ళే పెరుగు మనిషిని చీకట్లో, పసుపుతోట గట్టుమీద కీచురాళ్ళ జయజయ నినాదాలమధ్యన...కానీ ఆ అనుభవపు విలువను, ఎత్తును, అందుకోలేవు ఇవి. దానికి సామ్యం అదే! ఈరోజు వరకు...మళ్ళీ లేదు.

తనకు కొత్తగా ఉద్యోగం అప్పట్లో. భార్య యింకా రాలేదు తనకు. హోటలుభోజనం. ఆఫీసులోపని, సాయంత్రం

కైలుబద్దెలు లెక్కపెట్టి, రాత్రి గదిలో వొంటిరిగా నిద్ర. ఏవో ఆలోచనలు రేగి, నెత్తురును తోడి నరాలను తియ్యగా లాగి, అందంగా బాధపెట్టేవి; చాలా రాత్రివరకూ ఒక్కోసారి తెల్లవార్లూ అట్లాగే మేలుకొని కూచునేవాడు. నిద్ర పట్టేది కాదు. ఏదో శక్తి తన శరీరంనిండా పాకి పిచ్చెత్తించేది.

ఒక ఆదివారం కిటికీలో కూచుని గడ్డం చేసుకొంటు న్నాడు. వాతావరణంలో మార్పు గట్టిగా వచ్చింది. చుట్టూ చూస్తే వీధికెదురుమేడగడపలమీద మనిషి — తనవేపు చూస్తున్నది. ఆమె బొమ్మ అతన్ని కదిలించి, కలలు రేపి, బాధించింది ఆ నిమిషంనుండి. గొప్ప అందం. అంతకంటే ముఖ్యం వయసు. గట్టి అవయవాలు. దోవనవెళ్ళే ప్రతి పురుషుణ్నీ దగ్గరకు రమ్మని ఆహ్వానిస్తున్నట్లు కళ్లు చూపులు పంపేవి. ఎవరికోసమో వెదుకుతున్నట్లు, ఎదురుచూస్తున్నట్లు ఎపుడూ దిగులుగా వాకిట్లోనో మేడపిట్టగోడమీదనో ఉండేది. ఆ అన్వేషణ తనకోసమేనని తరవాతగాని అతనికి తెలియలేదు. ఆఫీసులో పని చెయ్యటం గతిలేక. ఎప్పుడూ, ప్రతి నిమిషమూ, ఆమెదగ్గర, ఆమెతో, ఆమెతోనే నిలిచే ఆలోచనలతో చీకాకయిపొయ్యేవాడు. గంటలు గడిచిన కొద్దీ ఆమెమీది "కోర్కె" పెరిగి, విశాలమవుతున్నది. ఆమెను 'సోదరి' అనుకొందామనిగూడా తీవ్రంగా ప్రయత్నిం చాడు. పవిత్రమూ, నిర్మలమూ అయిన సంబంధం ఏర్పరుచు కొనేందుకు చూసినా—వీలు చిక్కలేదు.

ఒకసారి ఆమె వీధిలో నడచివెళ్లింది. ఆమె అడుగులు తాకినచోట తనూ అడుగు వేసి నడిచి, తనజన్మ ధన్యమయిం

దనుకొన్నాడు. ఆమెను తాకిన గాలి, ఎండ తననూ తాకు తున్నందుకు పొంగిపోయ్యాడు. ఆ రోజునే రాత్రి దీపంతీసి మంచంమీద పడుకొన్నాడు. గుండె ఆగుతున్నది. ఏదో చిక్కనిపొగ అతన్ని ఆవరించి గొప్పమత్తులోకి అతన్ని నెట్టింది... లేత నీలపుకాంతి. పచ్చని మెరుపులు. రక్తపు ఎరుపులో పెద్దపువ్వు. ఆకుపచ్చని అలలు గోముగా కదలి, పువ్వును ఉయ్యాలలూపుతున్నాయి. పూరేకులమీద ఏవో శ్రవణమసృణమైన సంగీతాలు కదిలి నీలంలోకి పగులు తున్నాయి. పుష్పాడి తల్పం పువ్వుమధ్యన. ఆఫ్రికా అడవుల చీకటి పేరుకొని ఆమెజుట్టు అయింది. ఉన్నదో, లేదోనని సందేహం బాధించేట్లు గులాబిరంగు సన్నవస్త్రం అట్లా ఊరికే వొయ్యారంగా మీదకప్పుకొన్నది—ఆ పుష్పంలోని ఆమె వయస్సు అనూహ్యం. కన్యలోని సిగ్గు, యువతుల ప్రణయదీప్తి, ప్రౌఢాంగనల అనుభవమూ ఆమె కున్నాయి. ఏవో రంగుల ఆభరణాలు కంఠాన్ని తిరిగి, రొమ్ముల మీదికి. పంచరంగుల కిరీటం. నవ్వింది. లక్షల ఉపకన్యలు పరాజితు లయ్యారు. వొయ్యారంగా లేచి కలలు కరిగి విరిసే కళ్ళు అరమోడ్చి, జారే వస్త్రాన్ని సైతం లక్ష్యపెట్టక, మెత్తని హస్తాలు ముందుకుసాచి నడుస్తున్నది. నడిచి పరిమళలహరులను గడిచి, అతన్ని కావిలించుకొన్నది. అతను యిమిడి పోయ్యాడు ఆ దేవకన్య కౌగిలింతలో. నెత్తురు చిమ్మే పెదిమలతో అతని ముఖాన్ని తాకింది. కళ్ళను పెదిమలతో తెరిచింది. కన్న—చిన్న కొడుకునులాగా రొమ్ములకు అద్దుకున్నది. అతని నరాలు బద్దలవుతున్నాయి నెత్తురు వేడికి

వేగానికి. ఆమె వేళ్లనుండి, కళ్ల కాంతి నుండి అతనిలోకి నూతన లోకాలు తెరుచుకొన్నాయి. ఆ ప్రచండ మాధుర్యానికి, తేజస్సుకు తట్టుకోలేక, నరాలు జాలిగా మూలిగాయి. ఉక్కిరిబిక్కిరయి, ఊపిరి ఆగి, బరువురెప్పలుతోసి కళ్లు విప్పితే...ఆమె పడుకొనిఉన్నది తనప్రక్కన. దీపం డ్రాయరు మీద మత్తుగా చూస్తున్నది. వాళ్లను చీకటిగాలి కిటికీ జాగ్రత్తను హెచ్చరిస్తున్నది.

"నువ్వు!"

"మాట్లాడకు..."

గట్టిపమిటతో ఆపింది అతని మాటలు. ఆమె చేతులు అతన్ని దగ్గరికి తీసుకొంటున్నాయి. పమిటలో అలజడిపడే అతని వ్రేళ్ల స్పర్శలు మెరుపులయి, ఆమెలోకి ప్రవహించాయి. మళ్లీ రంగులు, పెద్దకొండమీద మేడలోని అందమైన గదీ, ఆమెవొళ్లోతలపెట్టి తనూ, వొంగి పెదిమముద్దుకునవ్వే ఆమే, మేఘాలలోని కిన్నెర మిథునాల మృదు సంగీతమూ...

ఎండ పిలుపుకు లేచాడు. వొంటరిగా ఉంది గది. దీపం ఇంకా చూస్తూనేవుంది. అన్నీ పరీక్షించాడు. తనను తను చూసుకొన్నాడు. ఏమీతోచలేదు. ఆరోజు ఆఫీసులేదు. అన్నమూ ఆట్టే రుచించలేదు. పగలు భారంగా జారింది. రాత్రి నక్షత్రాలనూ, చంద్రుణ్నీ పంపి, పరాకు చెప్పించింది. ఆ రోజల్లా అతను రాత్రి సంఘటనను మనసులో తిప్పుకొంటూనే ఉన్నాడు. గాలిలోకి చేతులుచాపి ఆలోచిస్తున్నాడు. రెండు పచ్చని, బలమైన పాములు అతని నడుమునుచుట్టి, ఇటువేపు తిప్పాయి. ఉలిక్కిపడి తిరిగితే,

"ఆమె" వొచ్చి, అతన్ని నిలువునా అద్దుకొన్నది. ఏదో మాట్లాడాలనుకొన్నాడు. కాని, ఆ తుఫానులో వీలుదొరక లేదు. మెల్లిగా చెయ్యిపుచ్చుకొని లాగింది. నీడలా కదిలాడు ఆమెతో. ఏమి అనటానికైనా భయమే! ఏమవుతుందో! తిరిగి పోతుందేమో తననుండి!

...అతను పెద్దప్రయత్నంతో గొంతు స్వాధీనంచేసుకొని, అన్నాడు—

"రాత్రి?"

"అవును. రాత్రి—నిద్రపోతున్నావు. ఏమిటానిద్ర? ఎన్నిసార్లు పిలిచాను?"

"నువ్వా?"

"ఎన్నిసార్లు? ఇంక తిరిగి పోదామనుకొంటున్నాను. అప్పుడు తీశావు తలుపు"

"నేనా? లేచానా?"

"నేను దేవకన్యనుగాదు సూక్ష్మరూపంలో నీ గదిలోకి రావటానికి? సీతారామయ్య కూతురు మునెమ్మను. మరిచిపోయావల్లే వుంది"

అతను కదిలాడు ఆమె వేపుకు.

"కాదు. ఎగతాళి నాతో! లేకపోతే, మామూలు మునెమ్మకు, ఈ తెల్లకళ్లు, తీర్చినవొళ్లు, గట్టి..."

"ఛీ."

ఎంతో సేపటికిగానీ, అతని పెదిమలు మళ్లీ మాట్లాడలేకపొయ్యాయి----ఆమె పెదిమచిక్కు తప్పుకొని.

అంటే! ప్రతిరోజూ రాత్రి పదిగంటలప్పుడు మునెమ్మ అతని గది కొస్తుంది. ఇంక ఉదయమే తిరిగి వెళ్లటం. ఆ గదిలో వాళ్ల చర్యలకు, జడములైన గోడలే చలించేయి. కొక్కొకుడే కొత్త పాఠాలు నేర్చుకొనేవాడు. ఆ మాటలకు, క్రమమూ, అర్థమూ, ప్రయోజనమూ ఉండవు.

"రాజూ!" అనేది ఆమె.

"రాజెవరు?" అనేవాడు అతను.

"నువ్వు"

"నా పేరు సూర్యారావు. ముద్దు పేరు సూర్యం."

"కాదు. నువ్వు రాజువే!"

"ఐతే రాజ్య మేదీ!"

"నేను"

"ప్రజలేరీ"

"నేను"

"రాణి ఏదీ?"

"నేను"

"అన్నీ నువ్వేనా ఏమిటి?"

"కాదా మరి? కాక ఇంకేమన్నా ఉన్నదా?"

అతను మాట్లాడేవాడుగాదు. మునెమ్మ దగ్గరగా వొచ్చి అతన్ని తేలిగ్గా కావిలించుకొనేది. ఇంకోసారి—

"నాకేమనిపిస్తున్నదంటే...?" అనేవాడు సూర్యారావు.

"ఇద్దరమూ ఎటన్నా లేచి..." అనేది మునెమ్మ.

"అదిగాదు"

"మరి ? మరేమిటి ?"

"నువ్వు నిజమా ? లేక అబద్ధమా ? ఇదంతా ఒక పెద్ద స్వప్నమేమో ? మెలుకువతో, ఇంత సుందరమూ పోతుందేమో ? అని—"

"పోదులేవోయ్ సూర్యం!" అనేది మునెమ్మ, అతని చెంపలకు అలా చేతులు ఆనించి ముఖాన్ని దగ్గరికి తీసుకొంటూ.

"ఈ చెంపలు, పెదిమలు, మెడ, భుజాల గుండ్రమూ, చేతుల బలమూ, ఇది నాది, అది నాది, అనేభావమే పోయి, ఇవన్నీ నేనే, ఇదంతా నేనే, అనే విశాలత్వంలోకి వెళ్లి, "నువ్వు,"—"నేను" అనే భేదం లేకుండా, ఇద్దరం వొకటే అయి..."

ఇంకోనాడు యెందుకో అడిగాడు సూర్యారావు.

"పోనివ్వండి" అన్నది మునెమ్మ అయిష్టంగా.

"సరేలే! తమాషాకు అడిగాను" అన్నాడు సూర్యారావు.

"ఉన్నాడు" అన్నదామె.

"మరి—చక్కని వాడు—?"

"కూడాను. బోలెడు పొలాలు, పెద్దయిల్లు, నౌకర్లు."

"అబ్బో!"

"అందుకే మావాళ్ళు యిచ్చారు"

అతను మాట్లాడలేదు.

"నాలుగేళ్ళు ఉన్నాను అతనితో కాపరంచేస్తూ"

"నాలుగేళ్ళు! ఇంత అందమూ, ఆ నాలుగేళ్ళూ వాడు . . . మరి . . ."

"నేను రెండో పెళ్ళాన్ని అతనికి"

"నువ్వా!! మొదటావిడ చనిపోయింది గావును. అవునా?"

"ఉంది. ఆమెకు పిల్లలు లేరు. అందుకని నన్ను చేసుకొన్నాడు. నాచేత పిల్లల్ని కనిపించుదామని"

"నీ చేతనా? గొడ్డువెధవ. నువ్వు యిట్లాగేవుండాలి. పిల్లలను కనే ఆడవాళ్ళు వేరు. వాళ్ళు అందుకు తప్ప మరెందుకూ పనికిరారు. ఇంత అందమూ, యవ్వనమూ బిడ్డల్ని కని నువ్వు చంపుకోవటం అన్యాయం . . ."

"మా సవితికీ నాకూ పడలేదు. వొచ్చాను. ఇంక పోను"

"పోతానన్నా, నేను పోనీను. కానీ ఎంతకాలం ఈ రహస్యం సాగుతుంది?"

"ఏమిటి?"

"మీ అమ్మ నాన్నలకు తెలిస్తే ముప్పురాదూ?"

"నాన్న సంగతి తెలీదు. అమ్మకు తెలుసు. నేనే చెప్పాను."

"నిజమా!!!"

"ఏమీ అనలేదు. 'జాగ్రత' అని మాత్రం అన్నది. అంతే"

"ఓహ్"

అని ఉత్సాహంతో ఆమెను ముద్దు పెట్టుకొన్నాడు సూర్యారావు. అంతే! ఇది జరిగిన రెండు మూడు రోజులకే

అతను మూడు నెలలు సెలవు పెట్టాలిసొచ్చింది. నాన్నకు జబ్బు. తరవాత ఏవో వ్యాజ్యాలు బలవంతాన పెళ్ళి. భార్య కాపరానికి రావటం. సెలవు. తరవాత తెలిసింది—తనను యింకోవూరుకు ట్రాన్స్ఫరు చేశారని. పెళ్ళిని తప్పించుకొనేందుకోసంకంటే ఈ ఉద్యోగపు మార్పిడిని గురించి ఎంతో శ్రమపడ్డాడు సూర్యారావు. లాభంలేకపోయింది. అతను కట్టిన గాలిమేడ లన్నీ కూలిపొయ్యాయి. భార్య శృంగారానికి అలవాటుపడ్డాడు. ఆ విషయం మరుపు రాక పోయినా, తీవ్రంగాపట్టుకు తినలేదు. అప్పుడప్పుడు మునెమ్మను తలుచుకొని చాటుగా విచారించేవాడు. ఒకటి రెండు సార్లు ఆ వూరువెళ్ళి విచారించాడు. మునెమ్మ అత్తవారింటికి వెళ్ళిందని తెలిసింది. తనతో వెళ్ళనన్నది. కాని వెళ్ళింది. తనుమాత్రం 'పెళ్ళిచేసుకో' ననలేదా? ఐనా చేసుకోకతప్పిందా? తనకుమల్లే ఆమెకూ ఏ విష సంఘటనలు వొత్తిడిచేశాయో మరి, తనెట్లా మునెమ్మను దూషిస్తాడు?

నిన్న తెలిసింది అతనికి, మునెమ్మ అత్తవారి ఊరు ఈ సమీపంలోనే నని. ఉదయమే బయలుదేరాడు. ఒక్కసారి మునెమ్మను చూసి, ఆ అనుభవాన్నంతా జ్ఞప్తిచేసుకొని... వద్దామని. రైలుపరుగెత్తుతున్నది. పొలాలు, చెట్లు వెనక్కు జారుతున్నాయి. గాలి చల్లగా పొలాలనుండి, లేత ఎండ మెరుగులో నుండి అలలుగా తాకుతూంది కిటికీలోనుండి. పల్లెయువతి బలమైన చెంపలు, బిస్కట్లు తినే కుర్రవాడి కళ్ళ మూగకాంతి, సినిమాతార మూడురంగుల ముఖమూ అతన్ని కదిలించలేకపోతున్నాయి. ఎండనుండి, జోకొట్టే

గాలినుండి, అతని మనస్సు తప్పుకొని, మునెమ్మ ఊసును, మునెమ్మను చేరుతున్నది.

గాలి దెబ్బలకు లేచి విరిగే సముద్రపు టలలుగా జ్ఞాపకాలు లేచి పడుతున్నాయి మేలుకొని ..

సూర్యారావు ఎక్కువ శ్రమలేకుండానే ఆ యిల్లు కనుక్కొన్నాడు. పెద్ద యిల్లు. ఆవులు, ఎద్లు, గేదెలు, ధాన్యపుసంచులు...పెద్ద మర్యాద. మంచమూ, పరుపూ, దిండ్లూ, సిగరెట్లు, ఇవి సరే కానీ—కాసేపటికి మునెమ్మ వొచ్చింది బైటికి. ఆమెను చూసి చప్పున గుర్తుపట్టలేక పోయినాడు సూర్యారావు. అంతగా మారిపోయింది. చుట్టూ ఎవరూ లేకుండాచూసి...

"ఏమిటిది ?" అన్నాడు అతను.

"ఏముంది ? ఏమీ లేదు"

"మరి—"

"ఇంతే !"

"ఎన్ని అనుకొన్నాం ? ఎంత దూరంగా, అందంగా ఆలోచించాం ?"

"అవును"

"అన్నీ యిట్లా అయినై..."

ఆమె మాటలు తప్పించింది.

"నీకు పెళ్ళి... ?"

"ఐంది"

"పిల్లలా ?"

"ఆడపిల్ల" అన్నాడు.

ఇంతే! ఏ ఉత్సాహమూ లేకుండా సంభాషణ జరిగి పోయింది. సూర్యారావు దోవలో కన్న కలలు జారిపోతు న్నాయి. కాసేపటికి లోపలనుండి కేకవొస్తే మునెమ్మ వెళ్లింది. తిరిగి గంటసేపటికి గాని ఆమె రాలేదు. ఒస్తూనే, చంకలో ఉన్న కుర్రవాణ్ణి సూర్యారావుకు చూపిస్తూ—

"వీడు—మావాడు" అన్నది.

"అంటే?" అన్నాడు సూర్యారావు.

"అంటేనా" అన్నది మునెమ్మ నవ్వుతూ "కొడుకు"

"నీ...?"

"అవును" కొడుకును ముద్దుపెట్టుకొన్నది. "వొట్టి రాలుగాయి వెధవ. క్షణంసేపు మనిషిని విడువడు. మరీ ఎత్తు మరిగాడు. ఏరా గోపీ! మావయ్యదగ్గరకు వెడతావా? మామయ్య నిన్ను చూడడానికి వొస్తూ వొస్తూ ఏమి తెచ్చాడో అడుగూ"

సూర్యారావు నెత్తురు చల్లబడ్డది. కళ్లముందు కాంతులు కదిలాయి. నెత్తురుపోయిన వాడిలాగా దుర్బలు డయ్యాడు. రెండుచేతులూ తలలో యిరికించుకొని నేల చూపులు చూస్తున్నాడు. తను మావయ్యా! ఇదేంవరస? ఈ ప్రకారమైతే మునెమ్మ తనకు........

కొంచెం సేపటికి --

"ఇప్పటిదాకా బజార్లో ఏం జేస్తున్నారండీ? రామ రామ రామ! ఎక్కడెక్కడి సంగతులూ ... మీకోసం చుట్టాలుగూడా భోంచెయ్యకుండా కూచున్నారు" అన్నది అప్పుడే వొచ్చిన భర్తతో. "సూర్యం! వీరే మీ బావగారు.

అదేం! కనపట్టలేదూ నీకు చెప్పాలిటగాని—ఈయన సూర్యా రావుగారని, మా యింటిదగ్గరే ఉండేవారు. వీరూ నేనూ "అన్నా—చెల్లెలు"లాగా ఉన్నాం చాలారోజులు. తరువాత ఇంకో ఊరికి . . ."

"ఓహో!" అని మాత్రమే అన్నాడు మునెమ్మ భర్త.

ఆరాత్రి సూర్యారావుకు నడవలో మంచంవేశారు. అతనికింకా మునెమ్మమీద ఆశ చావలేదు. పదిమందికోసం--అట్లా అనకపోతే బాగుండదని--ఎవ్వరికీ అనుమానం తగలకుండా ఉండేందుకు---మునెమ్మ అటా అన్నదనే అతను ఊహించాడు. ఆ రాత్రి సూర్యారావు నిద్రపోలేదు. ఎంత ప్రొద్దుబోయినా మునెమ్మ తనదగ్గరకు వొస్తుందని, మళ్ళీ వెనకటిలాగ . . . అందుకే ప్రతి చిన్న చప్పుడుకూ, ఉలికిపడి చూశాడు. అతని శ్రమ ఫలించలేదు--- తెల్లవారబోతున్నది. పనివాళ్ళు అప్పటికే లేచారు. గట్టి నిట్టూర్పుతో సూర్యారావు లేచాడు. ఎవరికీ చెప్పకుండానే బయలుదేరాడు. అతని శరీరం కుతకుత ఉడుకుతున్నది ఉషోనిలం జాలిగా లాలిస్తున్నది.

———